# పతనం

చీకట్లో - రైలు విడిచిన బాణంలా పరుగెత్తుతోంది.

ప్రపంచం బ్రద్ధలైపోతున్నట్లుగా గాలి అరుస్తూ గీపెడుతోంది. పట్టాలు దడదడలాడిపోతున్నాయి.

ఫస్ట్‌క్లాస్ కుప్పేలోంచి విండోగ్లాస్‌ను లేబట్టి బయటికి చూశాడు ముద్దుకృష్ణ. ఒత్తుగా కురుస్తున్న వాన చినుకులు ముఖానికి తుపాకి గుండ్లలా తాకాయి. వెంటనే వెనక్కి తగ్గి "అబ్బా - వర్షం చంపేస్తోందిరా" అన్నాడు ముఖాన్ని అద్దుకుంటూ.

ముద్దుకృష్ణ ఎదురుగా శ్రీరాముడు తన గ్లాసులో రమ్ సీసాలోని చివరి బొట్టును వంచుకుంటున్నాడు. అతని నోట్లో సిగరెట్టు కాలుతున్న వెండికడ్డీలా.

"డోర్ మూసేసి మందుకొట్టరా—వర్షంగోల నీకెందుకు. యివన్నీ చేసినా ఒంటికి వేడెక్కక చస్తుంటే ఆ కిటికీ తెరిచి యింకా చలిలో చంపేస్తున్నావు. క్లోజిట్"

ముద్దుకృష్ణ కిటికీమూసి - ఎదురుగా సీసాలమధ్య ఉన్న డన్‌హిల్ సిగరెట్టు పెట్టెనందుకున్నాడు.

ముద్దుకృష్ణ అసలుపేరు కిష్టయ్య. అతను మొదట్లో మట్టితో యిటుకలు చేసేవాడు. యిటుకల యిండస్ట్రీలో ఉండగా అతనో పరమ సత్యాన్ని గ్రహించేడు. ఇటుకలుగానీ, అటుకులుగానీ, ఏదైనా...

చేసేవాళ్ళెవ్వడూ బాగుపడడు - చేయించేవాడే ఎప్పటికైనా తప్పకుండా బాగుపడ్తాడు లేక బాగుపడవలసి ఉన్నవాడెవడూ యీ అటుకులో యిటుకలో చేస్తూ పడుండకూడదు - అని. ఆనాటినుంచి తను పనిచేయడం మానేసి పనికిరాని మనుషులతో పనిచేయించడం మొదలెట్టి ఎదిగిపోవడం ప్రారంభించేడు. మట్టిపనినుంచి సిమెంటుపనికి, సిమెంటు పనినుంచి యినుప పనికి - యిలా ఎదిగి ఎదిగి 'ఏ' క్లాసు కాంట్రాక్టరయ్యేడు- అతనిప్పుడో యింజనీరింగ్ కన్సల్టెంటుకు ప్రొప్రయిటర్. అతని క్రింద ఏడుగురు యం. టెక్ చదివిన యింజనీర్లు, యింకా పదిమంది చిల్లర పిల్ల ఇంజనీర్లూ, పదిహేనుమంది డిగ్రీలు చదివిన గుమాస్తాలూ, ఆరు ఆల్సేషియన్ కుక్కలూ చెప్పుచేతలలో పనిచేస్తున్నాయి.

శ్రీరాముడు ముద్దుకృష్ణుని చదువుకున్న బ్రోకర్, కం పి. ఎస్. కం అసిస్టెంట్ కం ఫ్యాన్ కం అడ్వయిజర్ కం స్నేహితుడు. యీ అన్నీ అవసరాలకూ పనికొచ్చే విధంగా అతన్ని వాడుకునేందుకు అతనితో 'రా' అని అనుకోగలిగే స్నేహాన్ని చూశాడు.

ముద్దుకృష్ణ - ఏ సందర్భంలోనూ తను యిదివరకు ఎంతో కష్టపడి, అంటే యిటుకలను చేసికూడా యింత పైకి వచ్చు పరమసత్యాన్ని మరచిపోకుండా ఉండేందుకై బంగారు యిటుకలను చేయించుకుని తన గత జీవితాన్ని గుర్తుగా వాటిని రోజూ చూసుకునేందుకు అల్మారాలో భద్రంగా దాచుకున్నాడు.

ముద్దుకృష్ణ నిండుగావున్న రమ్ గ్లాసును గడగడా కొట్టేసి-సిగరెట్టును సగం కాలిపోయేట్టు బలంగా పీల్చి-ఎదురుగా ఖాళీ అయిపోయిన చికెన్ ప్లేటని చూచి విసుగ్గా - "యిప్పుడే అన్నీ అయిపోయేయే" అన్నాడు. అంటూ ఖాళీ రమ్ సీసాను కిటికీలోంచి బయటికి విసిరేశాడు.

సీసాలను పరుగెత్తేరైలులోంచి బయటికి విసిరేయడం అతని హాబీ. సీసామెరుస్తు ఎక్కడో పడిపోవడం కనిపించింది.

"ఏదో స్టేషన్ వస్తున్నట్టుంది—రాగానే డిషెస్ అన్నీ తెప్పించు బ్యాగ్‌లోంచి యింకోసీసాతీసి కొట్టేదాం-" అన్నాడు విలాసంగా వెనక్కు ఒరుగుతూ.

"ప్రయాణం బలే బోర్‌గా వుంది. నాకో సీతా, నీకో గోపికా వుంటే ఎంత బాగుండును. మద్రాస్ చేరేలోగా ఎన్ని స్వర్గాలను చూద్దుమో-" అన్నాడు శ్రీరాముడు.

"ఆలోచనలు ఆలస్యంగావస్తే లాభం లేదబ్బాయ్. యీ బుద్ధి జర్నీ స్టార్ట్ చేసేప్పుడే వుంటే ఎవతినైనా తెచ్చుకుందుంగదా"

రైలు వేగం తగ్గుతోంది "ఏ స్టేషన్‌రా యిది—" "ఊఁ... విజ...యవా...డలా ఉంది."

"దిగి మనకేం కావాలో వాటికోసం ట్రై చెయ్...." మళ్ళీ రైలు బయలుదేరింది. వర్షం తగ్గలేదు పెరిగిందింకా.

"లాభం లేదు గురూ ... ఎవతీ కనిపించ లేదు .... యింకో బాటిల్ కానిచ్చి పడుకుందాం" అన్నాడు శ్రీరాముడు.

"సర్లే—" సిగరెట్టు వెలిగించు కుంటున్నాడు ముద్దుకృష్ణుడు— సరిగ్గా ఆ దృశ్యంలో...వాళ్ళిద్దరున్న కుప్పె తలుపుపై చప్పుడై— తలుపులు తెరచుకుని—

గుమ్మంలో ఆమె—తెల్లగా మనిషి, తెల్లనిచీర, తెల్లని జాకెట్టు-నల్లగా చేతులకు గౌవ్స్ కాళ్లకు నల్లని సాక్స్, హైహీల్స్ షూ, బాబ్డ్‌హేర్, చేతిలో...వేళ్ళ సందున కాలుతున్న కింగ్‌సైజ్ సిగరెట్టు-

"మె ఐ కమిన్" అంది సన్నగా ... వయ్యారంగా ... నాజూగ్గా. అనుకోకుండా లక్ష రూపాయిల లాటరీ తగిలిన గుమాస్తా గుర్నాథం ముఖంలా యిద్దరి ముఖాలూ విచ్చుకున్నాయి.

"ప్లీజ్ బి సీటెడ్" అన్నాడు శ్రీరాముడు తను ప్రక్కకు జరుగుతూ, ఆమె కూర్చుంది.

"వాట్ షల్ విడు ఫర్ యు మేడం"

"ఏమీలేదు...నాది ప్రక్క కుప్పె ఒక్కదాన్నే ప్రయాణం చేస్తున్నాను బోర్ కొట్టోంది. జస్ట్ కంపెనీ కోసం."

"ఓహ్...విత్ ప్లెజర్..."

ముద్దుకృష్ణ చకచకా రమ్‌ను గ్లాస్ నిండావంచి, సెవెన్ సెవెన్ కలిపి "మాతోపాటు..." అని అతి దీనంగా యాచిస్తూ అందించాడు.

ఆమె యిద్దరివంకా మత్తుగా చూచి. చిన్నగా నవ్వి గ్లాసు నందుకుంది.

యిద్దరి నరాల్లోనూ విద్యుత్ ప్రవహించి ప్రవహించి...మత్తు-మజా-కోరిక-మైకంలో మంటలు రేగి - తపన....తపన - గుండెలనిండా లావాలా మరిగే-వేడి యింకో గ్లాసు.

ఆమె నవ్వుతోంది ... తాగుతోంది .... తాగుతూ .... నవ్వుతూ కవ్విస్తోంది.

యిద్దరి కళ్ళముందూ రెండులైట్లు పదిలైట్లయి...ఆమె ఒక్క రూపం కోటిరూపాలై—కన్నులనిండా కోరికే.

శ్రీరాముడు ఆమె నడుముపై చేయివేసి...దగ్గరకు లాక్కుని— ఆమె అడ్డు చెప్ప లేదు. నవ్వింది కళ్ళలోకి చూస్తూ.

ముద్దుకృష్ణుడు లేచాడు తూలుతూ ఇద్దరు ఒక్కసారిగా ఆమెపై బడి–ఆమె అరవ లేదు. నవ్వింది.

ఆమె తెల్లని బట్టలు నలిగి పోతున్నాయి. కాలం నరాల్లో నుంచి కలిసి కారిపోతూ....

మత్తులోనుంచి .... అనుభవంలోకి .... అనుభవంలో నుంచి ... తెగిపోతున్న అగ్ని ధారలలోకి–ప్రక్కనున్న సీసాలు, సిగరెట్లు, గ్లాసులు – చిందరవందరంగా పడిపోయి – శరీరంపై శరీరాలు పెనుగులాడి...

ముద్దుకృష్ణ కిటికీ తలుపులు తెలిచాడు. వర్షం వెలిసింది. యిద్దరూ తలెత్తి చూశారు ఆమె వంక.

ఆమె సోఫాలో వెనక్కి వాలి...కళ్ళుమూసుకుని ముఖం నిండా చెమట. యిద్దరూ చూసుకున్నారు పరస్పరం–

కళ్ళ నిండా భయం ... రిలీఫ్ ... అలజడి ... అన్నీ కలగలపి – ఆమె అలాగేపడుకుంది యింకా—

యిద్దరూ సిగరెట్లు వెలిగించుకుని...తాగి, తాగి ... మళ్ళీ యింకో సిగరెట్టు – 'ఆమె యింకా తేరుకుని లేవదేమి ?' యిద్దరిలోనూ ఆందోళన.

ఆమె కదిలింది...కదిలిలేచి వరిగ్గా కూర్చుని. యిద్దరి ముఖాల్లోకి సూటిగా చూచి – ఆ చూపుల్లో కవ్వింపులేదు, మత్తూలేదు ... కసి వుంది, ఎదుట ఏదుంటే దాన్ని మసి చేయగలిగే జ్వలనం వుంది.

మెల్లగా ... ఒక చేతిగ్లోవ్‌ను విప్పింది. చేతికన్నీ మొండి వ్రేళ్ళు. ఎర్రగా ... రక్తం కారుతూ, చీమునిండి ప్రతి వ్రేలుకూ పుండ్లు.... అనేక పుండ్లు.

ఇంకో చేతిగ్లోవ్ తీసింది. ఇంకా భయంకరంగా చేయంతా చెదలుపట్టినట్టు చివికిపోయి...

కాళ్ళ సాక్స్ విప్పించి. మొండిపాదాలు...వ్రేళ్ళ స్థానే పుండ్లు పడి చీమూ నెత్తురు కారుతూ - కుష్ఠు— కుష్ఠు—

"ఆమె కుష్ఠుది— ఆమె కుష్ఠుది!" "కుష్ఠు రోగివి ... తామిద్దరూ.... ఛీ, ఛీ—"

రైలు వేగం తగ్గుతోంది - ఆమె కుప్పె తలుపులను దబాలున వేసి... వెళ్ళిపోతూ-ఇద్దరి కళ్ళలోనూ కొలుకోలేని భయం. భయం సముద్రంలా పొంగుతోంది.

x x x

ఆమె వెదికి - ఓ పాత డైరీని బయటికి తీసింది. చక చక పేజీలను త్రిప్పి- ఓచోట ఆగి —

22 మే, 1967 :

మగవాళ్ళలో ఇంతటి నీచులూ ... యింతటి కిరాతకులూ ... యింతటి భ్రష్ఠులూ వుంటారని— నేనెన్నడూ ఊహించలేదు.

యివ్వాళ రాత్రి, నా భర్త ... అక్షరాలా నన్ను అగ్నిసాక్షిగా పెళ్ళిచేసుకున్న భర్త, తనకు కావలసిన ప్రమోషన్ కోసం తన బాస్‌ను మా యింటికి తీసుకొచ్చి, పార్టీ యిచ్చి - చివరికి స్వామి కానుకగా నన్నే సమర్పించాడు.

ఎంత మొత్తుకుంటున్నా... ఎంతగా గింజుకుంటున్నా, పశువులా ఆ ఆంబోతు చెరచి చెరచి అయిపోయింది — పోగొట్టుకున్నాను. భార్యను పరాయి మగాడికి వప్పజేప్పే నా భర్త.... ఎంత మగధీరుడో!

యిప్పుడు నా శరీరంలోని నరనరాల్లో రక్తం బదులు కన్నీరు ప్రవహిస్తున్నాయి.

24 మే, 1967

ఆ అంటోతు మళ్ళీ వచ్చాడు.

ఒక్కసారి చెడిపోయినదాన్ని మళ్ళీ ఎలా చెడిపోగలను- (ఒక్కసారి చనిపోయిన మనిషి మళ్ళీమళ్ళీ చనిపోనట్లే) బలవంతంగా నా శరీరం వప్పగించబడింది.

28 మే, 1967

నా భర్త నాతో వ్యాపారమే ప్రారంభించినట్టున్నాడు. కార్లలో వస్తారు ఖరీదు విటులు. వానికి డబ్బు కావాలి. డబ్బే వాని లోకం-డబ్బే వాని జీవితం. డబ్బే వాని సర్వస్వం, నేను కాలిపోతూ వానికి డబ్బు పండిస్తున్నాను.

నన్ను యిప్పుడు మామూలుభాషలో ఏమంటారో తెలుసా ? 'వ్యభిచారిణీ' 'లంజా' అంటారు నన్ను. కాని నా చుట్టూవున్న ఖరీదైన వాతావరణం ఎవరిచేతా అలా అననీయదు!

ఇంకో డైరీ —

19 ఆగస్టు, 1969 :

ఈ వారం రోజుల పరీక్షల తర్వాత తేలిందేమిటంటే - నాకు కుష్ఠు వ్యాధి వచ్చింది. అతను యీ విషయం విన్నాడు. వెంటనే మెడబట్టి నన్ను బయటికి గెంటేశాడు.

ఇది నేనూహించిందే. ఈ నా పతనానికి కారణం ఎవరు... ఎవరు. మగాడు...మగాడు...మగాడు...

మగాని అంతుచూస్తాను. స్త్రీని ఆట బొమ్మగా వాడుకునే యీ డబ్బున్న మగవాళ్ళ అంతు చూస్తాను.

అందుకు యీ కుష్ఠువ్యాధే సాధనం కావాలి. అంతే.... అంతే....

29 సెప్టెంబర్, 1969;

ఆ డబ్బున్న మనిషికి నా అందంగా కనపించే శరీరానర్పించాను. తర్వాత నా అసలైన కుష్ఠు రూపం చూపించాను. వాడు భయంతో హడలి...

ఇక వాడ్ని వెంటాడి యీ భయంతో వాడెన్నాళ్ళు బ్రతుకుతాడో, ఎలా కుమిలి కుమిలి చస్తాడో చూడాలి. వాడిపేరు ఈశ్వరట. మలక్‌పేట కాలనీ...వాచ్...వాచ్...

9 అక్టోబర్, 69;

ఈశ్వర్ చచ్చాడు.

ఓ కుష్ఠుదాన్ని అనుభవించానే ఎలా...ఎలా అన్నభయంతో మ్రింగలేకా కక్కలేకా చచ్చాడు.

ఇప్పుడు నాకెంతో సంతోషంగా వుంది. ఇక నా మార్గం యిదే. వీలైనంతమందిని హత్యచేసి నాకు జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకోవడమే.

ముద్దుకృష్ణ చని పోయాడు. యింత వరకు నన్ననుభవించిన యిరవై ఆరు మందిలో...ముద్దుకృష్ణతో చని పోయిన వాళ్ళు సంఖ్య పద్దెనిమిది.

ఒక స్త్రీని బలి చేసినందుకు...పద్దెనిమిది మంది మగాళ్ళను హ్హా హ్హా హ్హా-

ఆమె యింకా రాస్తోంది వేగంగా-కాని మొండి వ్రేళ్ళలో నుండి పెన్ను జారి పడిపోయి....ఆమె తన చేతి వంక అచేతనంగాచూస్తూ....

ఆమె కళ్ళ నిండా నీళ్ల పొర్లుతున్నాయి సముద్రాల్లా.